www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 అక్టోబర్ 2024

వన్‌స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : వేధింపులకు గురై బయటకు చెప్పుకోలేని మహిళలలక, బాలికలకు మనోధైర్యం కల్పించడమే వన్‌స్టాప్ సెంటర్ ముఖ్య ఉద్దేశమని ఒఎస్‌సి సిబ్బంది పేర్కొన్నారు. బుధవారం ఒదివీడు, ఎర్రంరెడిగారిపల్లెలో స్వచ్ఛత హి సేవలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఒఎస్‌సి సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత సమస్యలతో కేంద్రానికి వచ్చే వారికి న్యాయపరమైన సూచనలతో సహా అన్ని రకాల సేవలను అందిస్తుందని అన్నారు. న్యాయ, వైద్య, పోలీస్ శాఖలత సమన్వయంతో బాధిత మహిళకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గృహహింస, వరకట్న వేధింపులు, అత్యాచార ఘటనలు లాంటివి ఏవి చోటు చేసుకున్నా హెల్ప్‌లైన్ 181కు ఫోన్‌చేస్తే, తక్షణమే వారికి సాయం చేయడానికి స్పందిస్తోందని తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారానికి 181ను సంప్రదించి సలహాలు పొందవచ్చని సూచిస్తున్నారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది షేక్ హసీనా, రెడ్డి ప్రసన్న, సుజాత, గ్రామీణ మహిళలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

- కారును ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో ముగ్గురు.. రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతి
- ఆరుగురికి తీవ్ర గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం

రైల్వేకోడూరు : మృతి చెందిన ప్రేమ్ కుమార్, వాసవి, సుచిత్ర

రైల్వేకోడూరు : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

అన్నమయ్య జిల్లాలో బుధవారం వేర్వేరు సంఘటనల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. రైల్వేకోడూరులో కారును బస్సు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే జిల్లాలోని పీలేరులో రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు.

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కడప-రేణిగుంట జాతీయ రహదారిలో బుధవారం సాయంత్రం పట్టణ సమీపంలోని రాజానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళితే... తిరుపతి నుంచి కడపకు వస్తున్న ఆర్‌టిసి ఎలక్ట్రిక్ బస్సు కర్నూలు నుంచి తిరుపతికి వెళుతున్న ఇన్నోవాను ఢీకొంది. ప్రమాదంలో కారు, బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న వాసవి(51), ప్రేమ్ కుమార్(45), సుచిత్ర (45) మృతి చెందారు. మహేష్, లలితమ్మ, ఉపేంద్ర, రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న మహమ్మద్, ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రుల్లో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి జిల్లా రేణిగుంట సమీపంలోని అమర ఆసుపత్రికి తరలించారు. సిఐ హేమసుందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి

రైల్వేకోడూరు : జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో నుజ్జయిన బస్సు, కారు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీలేరు : రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం పీలేరు పట్టణంలో వెలుగు చూసింది. రైల్వే పోలీసుల కథనం మేరకు పట్టణంలోని ఎస్.కె.డి.నగర్‌కు చెందిన శ్రీనివాస్ కుమారుడు కిరణ్ కుమార్ (19), పద్మావతి నగర్‌కు చెందిన ఫరాఫత్ అలీ కుమారుడు యాసిన్ (18) ఇరువురు మంచి మిత్రులు. కిరణ్ తిరుపతిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ, పీలేరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో యాసీన్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతూ కొంతకాలంగా చదువుమని ఇంటి వద్దే ఉంటున్నారు. మంగళవారం రాత్రి వీరిద్దరు చిత్తూరు మార్గంలోని రైల్వేట్రాక్ వద్దకు వెళ్లి కూర్చున్నారు. అదే సమయంలో నాగర్ కోయిల్ నుంచి ముంబాయి వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు వీరిద్దరిని ఢీకొందని తెలిసింది. రైలు డ్రైవర్లు స్థానిక రైల్వే స్టేషన్లో సమాచారం ఇచ్చారు. రైల్వే స్టేషన్ సిబ్బంది స్థానిక పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించారు. యాసిన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాగా, కిరణ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి రెఫర్ చేశారు. మార్గం మధ్యలో మృతి చెందిన కిరణ్ కుమార్ ను తిరిగి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబాబాష ఈ మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు. మ ృతుల నుంచి పోలీసులు గంజాయి ప్యాకెట్లు కూడా లభించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా పట్టణంలో యువత, విద్యార్తులు మొత్తు పదార్థాలకు బానిసలై తూలుతున్నారని, ఇదే విషయం పలుమార్లు స్థానిక పోలీసుల దష్టికి రావడంతో పోలీసులు కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. మత్తులో తూలుతూ రోడ్లపై జులాయిగా తిరుగుతూ ఘర్షణలకు పాల్పడుతున్నట్లు స్థానికులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వీటిపై దష్టిసారించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

పీలేరు : కిరణ్‌కుమార్ (ఫైల్)

పీలేరు : యాసిన్ (ఫైల్)

కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదు

- నేను వస్తున్నాననే తక్షణ సాయం
- బాధిత కుటుంబం పరామర్శలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-బద్వేలు

కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదని, ప్రజలకు భరోసా లేదంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. బద్వేలులో యువకుడి దుర్మార్గానికి బలైన విద్యార్థి కుటుంబాన్ని బుధవారం జగన్ పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటన జరిగినప్పుడే ప్రభుత్వం భరోసా ఇవ్వాలన్నారు. ఒక ఉన్మాది చేతిలో చదువుల తల్లి దస్తగిరమ్మ అతి కిరాతకంగా హత్య కాబడితే ఐదు రోజులకు గాని సాయం చేయడానికి మెలకువ రాలేదని, ఈ మొద్దుబారిన ప్రభుత్వానికి మనసు రాలేదన్నారు. బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వస్తున్నాడని తెలిసి బుధవారం ఉదయం ఆగమేఘాల మీద బాలిక కుటుంబంతో ఫోన్లో మాట్లాడి సాయం చేశామని చెప్పుకోవడానికి జిల్లా కలెక్టర్‌తో తక్షణ సాయాన్ని అందజేశారే కాని, నిజంగా చంద్రబాబు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందే ఎందుకు సాయం చేయలేదని సూటిగా ప్రశ్నించారు. కష్టాల్లో ఉండే కుటుంబాన్ని వారి ఇంటికి వచ్చి ఓదార్చినప్పుడే ఆ కుటుంబ సభ్యులకు కొండంత అండ అని, ఆ అలవాటు ఒక వైసిపికే సాధ్యమని, నా తండ్రి వైఎస్ఆర్ చనిపోయినప్పుడు ఆయన అభిమానించే అభిమానులు ఆ విషయం తెలుసుకుని భరించలేక గుండె పగిలి చనిపోతే ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి ఓదార్చనే గాని, ఏ ఒక్కరిని ఫోన్లో మాట్లాడి ఓదార్చలేదని పేర్కొన్నారు. అధికార జాతీయ పార్టీని సైతం లెక్కచేయలేదని, వారి కేసులకు భయపడలేదని, ప్రజల మనసు గెలుచుకోవాలనే ఆశ ఒకటే ఉండేదన్నారు. రాక్షస పాలనను మానుకుని ప్రజల మనసును గెలుపొందేలా వారి పాలన ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. నిందితునికిప్రత్యేక కోర్టు ద్వారా కఠిన శిక్ష విధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అప్పుడే ఇలాంటి ఉన్మాదులకు భయం కలుగుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు పాలన ఇలాగే కొనసాగితే ప్రజలు తిరగబడతారన్నారు. కార్యక్రమంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధ, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాష, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

విద్యార్థిని కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అతిది సింగ్

- బాధిత కుటుంబంతో ఫోన్లో మాట్లాడిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-బద్వేలు

వైఎస్ఆర్ జిల్లా బద్వేలులో పెట్రోల్ దాడికి గురై మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. ఆమె కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పెట్రోల్ దాడికి గురై మృతి చెందిన విద్యార్థిని తల్లితో సిఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. నిందితుడిని అరెస్టు చేశారని, కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరుపుతామని చెప్పారు. బాలిక సోదరుడికి చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఆమె తల్లికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి చక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ చంద్రమోహన్, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, టిడిపి బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టండి

- సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయాలని సభ్యుల డిమాండ్
- ఇన్‌ఛార్జి మంత్రులు, సిఇఒ గైర్హాజర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలని, జిల్లా ప్రభుత్వరంగ సంస్థల్లో నియమితులైన కార్మికుల వేతనమైన రూ.14 వేలల్లో రూ.ఐదు వేలు దోచుకుంటున్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కలెక్టర్ ఆధ్యక్షతన కమిటీ వేసి కాపాడాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పునరుద్ఘాటించారు. బుధవారం జిల్లా పరిషత్ చైరపర్సన్ జేష్టాది శారద అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కడప, అన్నమయ్య జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, కడప, రాజంపేట ఎంపీలు, రెగ్యులర్ కలెక్టర్, రెగ్యులర్ సిఇఒ గైర్హాజరైన నేపథ్యంలో సమగ్రంగా చర్చిండానికి సమావేశాన్ని వాయిదా వేయాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. జడ్‌పి డిప్యూటీ సిఇఒ మైథిలి స్పందిస్తూ పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం 90 రోజుల్లోపు సమావేశం నిర్వహించాలనే నిబంధన నేపథ్యంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.15 గంటలకు మూడు గంటల వ్యవధిలో ఆరు నుంచి ఎనిమిది విభాగాలను సమీక్షించడానికి పరిమితమైంది. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మొక్కుబడి సమాధానం లభించింది. చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డి అన్నదాత సుఖీభవ, డిఎస్‌సి పరీక్షలు, తల్లికివందనం అమలుపై నిలదీశారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి స్పందిస్తూ అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, డిఎస్‌పి పరీక్షలను క్రమపద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి నాటికి డిఎస్‌సి పూర్తి చేసి జూన్‌లో కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరతారని చెప్పారు. తల్లికివందనం అమలులో 12 లక్షల మంది విద్యార్థుల పేర్లలో తేడాలు ఉన్నందు వల్ల వాయిదా వేశామని తెలిపారు. నవంబర్‌లో పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయింపుల్లో స్పష్టత వస్తుందన్నారు. అనంతరం శనగ విత్తన సబ్సిడీ కుదించడం దారుణమని, వైసిపి హయాంలో 40 శాతం సబ్సిడీ ఇచ్చిందని చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ విమర్శించారు. శనగ విత్తనం బహిరంగ మార్కెట్లో ధర కంటే ఎక్కువ ధరకు ప్రభుత్వం ఇస్తోందని, ఇందులో సబిసడీ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్పందిస్తూ రాష్ట్రంలో అధికారం మారినప్పటికీ అధికారులు స్తబ్ధుగా ఉన్నారని, మత్తు వదిలించుకుని పని చేయాలని చురుకలు అంటించారు. ఎరువుల ధరలు ఎక్కువగా ఉన్నాయని, ఫిక్స్‌డ్ ధరల జాబితాను దుకాణాల ముంగిట ఉంచాలని సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ గ్రామీణ స్థాయికి చేరుకుని శనగల పంపిణీ దగ్గర నుంచి ఎరువుల ధరలు సహా ఇతర పథకా లను అమలు చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ డిఎఒ స్పందించి ఆర్ఎస్‌కె దగ్గరకు వెళ్లిన తరువాతే యాప్ పని చేస్తోందని, ప్రతి వ్యవసాయశాఖ అధికారి ఫీల్డ్‌కు వెళ న్నారని, మరింత దగ్గరగా పని చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి చైర్‌పర్సన్ శారద

ఇటీవలి తుపాన్ ప్రభావానికి 1433 హెక్టార్లలో నష్టం వాటిల్లిందని, ఎన్యూమరేషన్ చేసి నివేదికను పంపిస్తామని తెలిపారు. అనంతరం చక్రాయపేట జడ్‌పిటిసి మాట్లాడుతూ చక్రాయపేట మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ రాజంపేటలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని, జ్వర నివారణకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. కమలాపురం, పోరుమామిళ్ల సిహెచ్‌సిల్లో గైనకాలజిస్టులను నియమించాలని జడ్‌పిటిసిలు విజ్ఞప్తి చేశారు. జిజిహెచ్‌లో ఎంఆర్‌ఐ స్కాన్ క్వాలిటీని పెంచాల్సిన అవసరం ఉందని చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి చెప్పారు. అనంతరం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్యను పెంచినప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం చక్రాయపేట జడ్‌పిటిసి స్పందించి చక్రాయపేటలో అధిక పాలదిగుబడి లభిస్తోందని, దాణా ధరల కారణంగా ప్రతినెలా రూ.60 లక్షలు నష్టపోతున్నారని తెలిపారు. చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి ఉచిత గ్యాస్ సిలిండర్ల అమలు హామీ ఎప్పుడని, ఇందులో గ్యాస్ సిలిండర్, పొయ్యి కూడా ఇస్తారా లేక సిలిండర్‌కే పరిమితమా చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి స్పందించి దీపావళికి గైడ్‌లైన్స్ వస్తాయని చెప్పారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు పరిధిలో దాల్మియా పరిశ్రమ యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా వర్షాకాలంలో అలుగువాగు ఏరియా ఆక్రమణల కారణంగా దాల్మియా కాంపౌండ్ లోపలి భాగంతోపాటు, రెండు, మూడు దళిత గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయని విమర్శించారు. దీనిపై అప్పటి కలెక్టర్లు రెవెన్యూ అధికారుల తప్పుడు నివేదిక కారణంగా ముంపునకు గురవుతున్నారని, పరిశ్రమకు ఇబ్బంది తలెత్తకుండా, దుగ్గనపల్లి, నవాబ్ పేట, చిన్నకొమ్మెర్ల గ్రామాలకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. అనంతరం అన్నమయ్య రిజర్వాయర్ పునర్ధరించాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో ఎంపీ మేడా రఘునాథరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి, అన్నమయ్య డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ మైథిలి, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రెవెన్యూ అధికారులు తమ పనితీరు మెరుగుపరచుకొని శాఖ ప్రతిష్టను పెంచేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని స్థానిక కళాంజలి కల్యాణమండపంలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజంపేట డివిజన్ తహశీల్దార్‌లు, డిటిలు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు విఆర్‌ఒలు, విఆర్‌ఎలతో రెవెన్యూ అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి కార్యాలయం, సిసిఎల్‌ఎ కార్యాలయం, పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారం, డివిజన్ లో ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ల పరిశీలన, హైకోర్టు, ఆర్‌టిఐ, జాతీయ మానవ హక్కులు, లోకాయుక్త కమిషన్ కేసుల గురించి చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాలలో భూసే కరణ, అలియనేషన్ ప్రతిపాదనలు, నాలా కేసులు, డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ తీర్మానాలు వాటి అమలు, ఓటరు జాబితా సవరణ తదితర అంశాలలో కలెక్టర్ సమ గ్రంగా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవిన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. ఏలాంటి సమస్య అయినా కాలాతీతం చేయకుండా వేగంగా స్పందించి చట్టప్రకారం చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించడమే మన ధ్యేయం కావాలని తెలిపారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులలో మొత్తం వచ్చిన దరఖాస్తులు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, పెండింగ్ లో ఎన్ని ఉన్నాయి, ఎస్ఎల్‌ఎ పరిధిలో ఉన్న దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తుల పై సమీక్షించారు. పిజిఆర్ఎస్ సిఎంకు అత్యంత ముఖ్యమైనదని, ప్రతి వారం పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం పై ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్ష చేస్తోందని తెలిపారు. రాజంపేట డివిజన్ లో ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ భూముల పరిశీలనను సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో బాగా నిర్వహించారని అన్నారు. కోర్టు కేసులు లోకాయుక్త, జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీ అయిన విఆర్‌ఒలను వెంటనే రిలీవ్ చేయాలని తహశీల్దార్లకు సూచించారు. బదిలీ అయిన ప్రదేశంలో విర్‌ఒలు విధుల్లో చేరాలని, విధుల్లో చేరని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జెసి ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ఆయా అంశాల్లో తహశీల్దార్లు తమ పరిధిలో సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని చెప్పారు. వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం సర్కులర్ జారీ చేసిందని ఈ మేరకు నిబంధనలను అవగాహన కల్పించుకొని మండల వారీగా పారదర్శకంగా విచారణ చేసి... సిఎస్‌డిటి, డిఎస్‌ఒలతో సంప్రదించి రేషన్ కార్డులు జారీ చేయాల్సిన జాబితాను రూపొందించాలని పేర్కొన్నారు. సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, సర్వే శాఖ జిల్లా అధికారి భరత్ ‌ుమార్, డిఎసఒ, తహసిల్దార్లు, డిటిలు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్‌చామకూరి

విద్యార్థులు నైతిక విలువలు పెంచుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థుల్లో పట్టుదల, క్రమశిక్షణతో పాటు నైతిక విలువలు కలిగి ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మానవత అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్‌భాషా, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జానకి పేర్కొన్నారు. మంగళవారం మాసాపేట సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సమాజం పట్ల నైతిక విలువలపై అవగాహన కల్పించి మానవత ప్రశంసా పత్రాలతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులను గౌరవించి వారు చెప్పినటువంటి సూచనలను తప్పకుండా పాటించినప్పుడే ఉన్నతమైన శిఖరాలను చేరుకోగలుగుతారని అన్నారు. విద్యార్థి మంచి చదువుని అభ్యసించి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. స్నేహం కూడా చాలా పవిత్రమైనదని ఆ స్నేహం కూడా మంచి వారితో చేసినప్పుడే ఆకాశం ఎత్తుకు ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, చైర్మన్ ఆరమాటి శివగంగి రెడ్డి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, మండల కన్వీనర్ చింతంరెడ్డి వెంకటరామిరెడ్డి, గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, డైరెక్టర్ రామచంద్రారెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు మనోహర్‌రెడ్డి, జగదీష, బోధన ఉపాధ్యాయులు మహమ్మద్ ఇలియాస్, ఆంజనేయులు, ఉత్తన్న, రామచంద్రరెడ్డి, నాగయ్య, శేఖర్, వీరారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులతో మానవత సభ్యులు

గంగిరెడ్డిని సన్మానిస్తున్న పంచాయతీ ఇఒ గురుమోహన్

గంగిరెడ్డి సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-పీలేరు

జనం కోసం జానం గంగిరెడ్డి చేస్తున్న సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పీలేరు పంచాయతీ ఇఒ గురుమోహన్ తెలిపారు. సాంఘిక సేవారంగం ద్వారా జానం గంగిరెడ్డి సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించిన హైదరాబాదు 'ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్' గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక వెలుగు సమావేశ భవనంలో ఎపి గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు అధ్యక్షతన ప్రజా సంఘాలు ఆయనకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సమావేశానికి పీలేరు పంచాయతీ ఇఒ గురు మోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల దరణ్ కుమార్, జెట్టి మల్లికార్జున, సీనియర్ జర్నలిస్ట్ పఠాన్ జాకీర్, మాషా అల్లా ఆటో యూనియన్ నాయకుడు చాను గంగిరెడ్డి చేసిన సేవలను గుర్తుకు చేస్తూ ప్రశంసించారు. అనంతరం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ జానం గంగిరెడ్డికి దుశ్శాలువాలు కప్పి, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకుడు మద్దెల అమృత తేజ, సాయి సంపత్, ముస్లిం జెఎసి నాయకులు మౌలా, అమీర్, షైన్ బాబ్జాన్, చిరంజీవి, కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఔట్ రీచ్ వర్కర్లు రాజమ్మ, షర్మిల, మేము సైతం సమాజం కోసం అధ్యక్షులు షాహీన్ షా, మహబూబ్‌బాషా, ఇంతియాజ్, అహ్మద్ బాష, ఖాదర్‌వల్లి, వివిధ ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు రేషన్ డీలర్ల జిల్లా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రేషన్ డీలర్ల అసోసియేషన్ అన్నమయ్య జిల్లా సర్వసభ సమావేశం గురువారం పట్టణంలోని సిఎస్ఐ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం, ఎండియు వ్యవస్థలపై రేషన్ డీలర్ల సమస్యలను చర్చిస్తామని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు రేషన్ డీలర్ల వ్యవస్థకు అండగా నిలిచారని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన కార్యవర్గం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రేషన్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వి.లీలా మాధవరావు, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, తంబళ్లపల్లె తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి డి.జయచంద్రారెడ్డి, స్టేట్ సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని రేషన్ డీలర్లు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, మదనపల్లె పట్టణ అధ్యక్షులు ఇమాం ఖాసీం, రూరల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, మండల ఉపాధ్యక్షులు ముంతాజ్, ఇసి మెంబర్ డి.కవిత, గౌరవ సలహాదారులు కె.కళాధర్, జె.మురళి, మహేశ్వర, వై.అంజనప్ప పాల్గొన్నారు.

భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని బోయినపల్లి, తాళ్లపాక, మన్నూరు పంచాయతీల పరిధిలో ఉన్న ఎపిఐఐసి భూములను కొందరు వైసిపి నాయకులు ఆక్రమించుకొని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కలెక్టర్ శ్రీధర్‌కు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్, నిరుద్యోగ జెఎసి రాష్ట్ర కన్వీనర్ సిద్ధిక్, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ మాట్లాడుతూ ఎపిఐఐసి భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. రాజంపేటలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని, వాటిని అధిగమించాలంటే ఆక్రమణలో ఉన్న ఎపిఐఐసి భూములను నూతన పరిశ్రమల కోసం పారిశ్రామిక వ్యక్తులకు ఆ భూములను అప్పజెప్పితే కొత్త పరిశ్రమలు వచ్చి నిరుద్యోగ సమస్య తగ్గుతుందన్నారు. ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెంచాలని నిరంతరం మంత్రి నారా లోకేష్ శ్రమిస్తున్నారన్నారు. కొందరు వైకాపా నాయకులు భూములను కాజేసి పరిశ్రమ ఉండవలసిన స్థానాలలో వారి సొంత భవనాలు కట్టుకొని విలాసంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు.ఎపిఐఐసి భూములను ఆక్రమించిన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం తాళ్లపాక చెరువును కబ్జా చేసిందని, ఆ చెరువును ప్రక్షాళన చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి పాండురాజు, తెలుగు యువత నాయకులు ఎన్‌టిఆర్ కేశవ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్లను నియంత్రించవచ్చు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విత్తన శుద్ధి ద్వారా తెగుళ్లను సమర్థవంతంగా నియత్రించి మంచి దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సుధాకర్ తెలిపారు. బుధవారం అనంతరాజుపేట, రాఘవరాజపురం రాచపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సందీప్ నాయక్ అరటి, బొప్పాయి, మామిడిలో అధిక దిగుబడులు సాధించుటకు తీసుకొనవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. బొప్పాయిలో కంచె పంటలుగా జొన్న, మొక్కజొన్న, అవిసె వేయడం ద్వారా పసుపు జిగురు పళ్లెంలను ఎకరాకు 10 ఏర్పాటు చేయడం ద్వారా వైరస్ తెగుళ్ళను సమర్థ వంతంగా అరికట్ట వచ్చునని తెలిపారు. పంటలను పరిశీలించి చీడ పీడాలకి నివారణ చర్యలు రైతులకు తెలియజేశారు. మామిడి, అరటిలో ఫ్రూట్ కవర్లను వాడటం ద్వారా పురుగుల నుంచి రక్షణతో పాటు మంచి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో విహెచ్‌ఎలు లక్ష్మి నారాయణ, గంగాధర్ పశు సంవర్థక శాఖ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అరటిలో మెలకువలు తెలియజేస్తున్న శాస్త్రవేత్త సందీప్‌నాయక్

పాఠశాల సమీపంలో వైన్‌షాప్ తొలగించాలి : 'సిటు'

వైన్‌షాపు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరులో ఒంటెల సిద్దయ్య కాంప్లెక్స్ సమీపంలో నివాసాలు, కాలేజీ విద్యార్థులు వెళ్లే మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ స్థానిక మహిళలు సిఐటియు జిల్లా అధ్యక్షులు, సిహెచ్ చంద్రశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి పి జాన్ ప్రసాద్ ఆధ్వర్యంలో షాపు వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా నిర్వహించి ఎక్సైజ్ సిఐ టికె.తులసికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐ స్పందిస్తూ అక్కడ తాత్కాలికంగా షాపు ఏర్పాటు చేశామని పది రోజులు తర్వాత తొలగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోవింద్, జనసేన నాయకులు ముత్యాల కిషోర్, జి.సాయి, నాగయ్య, అమర్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు : తహశీల్దార్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రైతులకు భూములపై ఉన్న సమస్యలను పరిష్కరించడానికి రీ సర్వే భూములపై గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ధనుంజయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రీ సర్వే జరిగిన గ్రామాలలో రైతులకు అనేక భూ సమస్యలు ఏర్పడ్డాయని అన్నారు. వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం తవళం గ్రామంలో రెవెన్యూ అధికారులతో కలసి గ్రామసభను నిర్వహించామని తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకంలో భూముల వివరాలు వ్యత్యాసాలు ఉన్నాయని, భూములు జాయింట్‌గా పట్టాదారు పుస్తకంలో ముద్రించ బడ్డాయని, తదితర సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. రైతులు భూ సమస్యలను తప్పక పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, రీ సర్వే డిటి సిరాజుద్దీన్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, విఆర్‌ఒలు, రైతులు పాల్గొన్నారు. **గాలివీడు:** మండలంలోని గుండ్లచెరువు గ్రామంలో రెవెన్యూ సదస్సులో రీ సర్వే, ఫ్రీ హోల్డ్ భూముల పైన ప్రజల, రైతులు నుంచి వినతులు స్వీకరించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని విఆర్‌ఒ యశోద పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు వీరరాఘవ సర్వేయర్ సందీప్, మండల సర్వేయర్ మురళి, విఆర్‌ఒ భోగేశ్వరయ్య, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : మాట్లాడుతున్న తహశీల్దార్ ధనుంజయులు

విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి కృష్ణన్ కుట్టి

ఎస్‌సి హాస్టల్లో జడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని ఎస్‌సి సంక్షేమ బాలుర హాస్టల్‌ను బుధవారం అన్నమయ్య జిల్లా అదనపు జడ్జి కృష్ణన్ కుట్టి తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతి గదులను, నిద్రించే గదులు, వంటగదులు, స్టోర్ రూమ్, బాత్రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలని, విద్యా ర్థులకు సూచించారు. సమస్యలను సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరిస్తానని చెప్పారు. ప్రభుత్వ నిబంధన మేరకు విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల వసతులను అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యనభ్యసిస్తున్న సి. జాస్మిన్ బుధవారం ఎస్‌జిఎఫ్ అండం-17 హాకీ జిల్లా స్థాయి సెలక్షన్స్ వైయస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లోనిర్వహించగా అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నట్లు కళాశాల పిడి నీలకంఠ రావు తెలియజేశారు. నవంబర్ లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన నున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జాస్మిన్ కళాశాల ప్రిన్సిపల్ లీల శ్రీహరి, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినం దించారు. జాస్మిన్ రాష్ట్రస్థాయి పోటీలలో కూడా అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో పాల్గొనాలని అభినందించారు.

దళితులంటే అంత చులకనా

- మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి హరి

ప్రజాశక్తి-కలికిరి

దళితులు అంటే అంత చులకనా అని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి విహరి వాయల్పాడు ఎస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాల్మీకి పురం గాంధీపేటకు చెందిన రఘు అనే దళితుడిని ఫోన్‌లో అసభ్యకరంగా దూషించడం దారుణమన్నారు. బుధవారం కలికిరి క్రాస్ రోడ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం గురించి రఘు ఎస్‌ఐను ఫోన్‌లో సంప్రదించగా ఆయన కోపోద్రికుడై దుర్భాషలాడి అవమానకరంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు ఎక్కడ ఉండాలో అక్కడే ఉండండి అని రఘు పైన విరుచు కుపడి అవమానించడం సరైన పద్ధతి కాదని అన్నారు. న్యాయాన్ని కాపాడా ల్సిన వారే ఇలా దళితులను దుర్భాషలాడితే ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. భవిష్యత్తులో దళితులను అవమానపరిచిన వారికి శిక్ష విధించేలా చట్టం తీసుకురావాలని, ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో మళ్లీ జరగకుం డా బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కలికిరి మాల మహానాడు మండల అధ్యక్షుడు వి.భాను, ప్రకాష్, జిల్లా ప్రచార కార్యదర్శి సహదేవ, రామ, సురేష్ , గోవిందు, సంజీవ, సహదేవ, చంద్ర, శ్రీను, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి గ్రామంలో ఉన్నటువంటి గ్రంథాలయానికి ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే సుమారు 5 వేల రూపాయలు విలువగల స్టడీ మెటీరియల్స్ గ్రామానికి చెందిన ముమ్మీనేని సుబ్బరాయుడు గ్రంథాలయ నిర్వాహకుడు జి.శ్రీనుకు అందించారు. ఈ సందర్భంగా జడ్‌పి హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధా నోపాధ్యా యుడు రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను ఉచితంగా అందించడం మంచి పరిణామం అన్నారు.. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా పోలీసు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-పుల్లంపేట

మంగంపేట ఎపిఎండిసి కార్యాలయంలో ప్రత్యేక పోలీసు 33వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సంద ర్భంగా ఎస్‌ఐ శివ మాట్లాడుతూ ఎంతో పట్టుదలతో పోలీసు రక్షణ దళం పని చేస్తుందన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ సంబరా లను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ విశ్వనాథ్, పోలీసులు పాల్గొ న్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సోమశేఖర్ పేర్కొన్నారు. బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన రంగోత్సవ్ పోటీల్లో గురుకుల పాఠశాల కలికిరి విద్యార్థులు 80 మంది పాల్గొన్నారని తెలిపారు. ఇందులో పదవ తరగతికి చెందిన వి కావ్య శ్రీ మొదటి స్థానాన్ని సాధించగా, చేతి వ్రాత పోటీలో పదవ తరగతికి చెందిన ఎల్.అంజలి బహుమతిని పొందిందని చెప్పారు. డ్రాయింగ్, తంబు పెయింటింగ్, కార్టూన్ మేకింగ్, హ్యాండ్ రైటింగ్, గ్రీటింగ్ కార్డ్ ప్రిపేరింగ్ పోటీలలో పదిమందికి గోల్డ్ మెడల్స్, 8 మందికి సిల్వర్ మెడల్స్, 4 కి బ్రాంజ్ మెడల్స్ సాధించారని తెలిపారు. కలికిరి పాఠశాల నుండి ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొని మెడల్స్ సర్టిఫికెట్స్ పొందడం వల్ల పాఠశాలకు బెస్ట్ స్కూల్ అవార్డు, ప్రిన్సిపల్‌కు ప్రత్యేకంగా జ్ఞాపికను అందించారని చెప్పారు. ఈ సందర్భంగా బహుమతులు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు.

గుండెపోటుతో రైతు మృతి

- పరామర్శించిన ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

గుండెపోటుతో రైతు మృతిచెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని కన్యమడుగు పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన రైతు కెఆర్. చిన్నరెడ్డి(66) శనివారం గుండె నొప్పి రావడంతో కుటుంబసభ్యులు బెంగ ళూరు ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అక్కడ అన్ని పరీక్షలు నిర్వ హించి ఆదివారం ఉదయమే ఆసుపత్రికి రావాలని సూచించారని అన్నారు. ఉదయం బాత్రూంలో ఉండగా మళ్లీ గుండెపోటు రావడంతో హుటాహుటిన బెంగ ళూరులోని ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అప్పటికే ఆయన మృతి చెంది నట్లు డాక్టర్లు నిర్ధారించారని అన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి బుధ వారం రెడ్డివారిపల్లెకు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

వైసిపి సీనియర్ నాయకుడు..

ప్రజాశక్తి-కలకడ : సంబేపల్లి మండలం ఎస్.సోమవారం పంచాయతీ దేవలం పేటకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు సయ్యద్ అమీర్‌బాషా బుధవాకరం గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం సాయంత్రం బిపి స్థాయి పడిపోవడంతో కుటుంబ స్థానిక వైద్యశాలకు తీసుకెళ్లినట్లు తెలిపారు. అప్పటికే గుండె పోటుకు గురై మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు.మాజీ సర్పంచ్‌గా, మండల కో-ఆప్షన్ సభ్యులుగా ప్రజలకు సేవ చేశారని చెప్పారు. అమీర్‌బాషా మృతి పట్ల వైసిపి నాయకులు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు చిదంబర రెడ్డి, బంధువులు అహ్మద్ భాషా రూహుల్లాబాష తమ సంతాపం వ్యక్తం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.ఇద్దరు కుమార్తెలలో ఒక కుమార్తెకు వివాహం కాగా మరో కుమార్తెకు వివాహం కావలసి ఉందని చెప్పారు.

విద్యతోపాటు వ్యవసాయమూ అవసరమే

ప్రజాశక్తి-పీలేరు

ప్రస్తుత సమాజంలో పిల్లలకు ఉన్నత విద్యతో పాటు వ్యవసాయంపై కూడా అవగాహన కలిగి ఉండాలని వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు జ్ఞానశ్రీ అన్నారు. స్థానిక సిఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో బాటని అధ్యాపకురాలుగా పనిచేస్తున్న జ్ఞానశ్రీ బిఎస్‌సి చదువుతున్న విద్యార్థులకు పాఠ్యాంశాలనే కాకుండా పొలం నుంచి కంచంలోకి ఆహారం ఎలా వస్తోందనే అంశంపై విద్యా ర్థులకు అవగాహన కల్పించాలని అనుకున్నారు. ఈ క్రమంలో కళాశాల ఆవర ణంలోని ఖాళీ స్థలాన్ని పెరటి తోట పెంపకంగా మార్చి విద్యార్థులచే పది రకాల కూరగాయలను పండించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జ్ఞాన శ్రీ మాట్లాడుతూ ప్రతి మనిషికీ విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన కల్పించుకుని తమ ఇంటి ఆవరణలో లేక మిద్దె తోట పెంపకం చేసుకుని ఆరోగ్యకరమైన పంటలని పండించుకోవాలని కోరారు. మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమకు కూరగాయలు ఆకుకూరలను పండించుకునే విధానంపై అవగాహన కల్పించిన తమ అధ్యాపకురాలు జ్ఞానశ్రీ, కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ లావణ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి

ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి-వీరబల్లి

ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలని ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాఖ్యలో ప్రతినెల జరిగే లావాదేవీలు సభ్యులందరికి వివరించి తీర్మానించాలని తెలిపారు. సమాఖ్యలో పనిచేసే సిబ్బంది చిన్న సంఘాల నెలవారి సమావేశాలకు విధిగా హాజరు కావాలని తెలిపారు. తీసుకొన్న అన్ని రుణాలు వంద శాతం చెల్లించాలని, రుణాలతో జీవనోపాదులు ఏర్పాటుతో ఆదాయం పెంచుకోవాలని అన్నారు. సంఘ సభ్యులకు బ్యాంకు ల ద్వారా స్వల్ప వడ్డీతో వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తున్నామని అన్నారు. సామా జికాం ట్రస్టుకి నిధి, స్త్రీనిధి రుణాలు బకాయిలున్న గడికోట, సానిపాయ, వంగిమళ్ల, పెద్ద పాలెం నవాదలలో బకాయి ఉన్నాయని వెంటనే వసూళ్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపిఎం భారతీదేవి, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి గులాబ్ జాన్, ఉపాధ్యక్షురాలు వారాదమ్మ సిసిలు, కృష్ణ, నాగేంద్ర, సుధాకర్, గంగాధర, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పీడీ, విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

వ్యాయామ ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు నల్లబోయిన గౌరి బుధవారం ఘనంగా సన్మానం అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి, ఎంఇఒ నాగయ్య, ఉపాధ్యాయులు తెలుసు ఆమెను ఘనంగా సన్మానించారు. ఇటీవల ఎస్‌జిఎఫ్ క్రీడల్లో భాగంగా ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో నాగిరెడ్డిపల్లి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అందుకు విశేషంగా కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరిని అభినందిస్తూ శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఉమ్మడి కడప జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయికి షాట్‌పుట్ పోటీల్లో అండర్-14లో భాగంగా ఎనిమిదవ తరగతి విద్యార్థి సయ్యద్ ఉమర్‌సుస్మాన్‌అలీ, యోగా పోటీల్లో ఏడవ తరగతికి చెందిన నూరేష్లి ప్రణీత్, కబడ్డీ పోటీల్లో సంజాపురి హర్షవర్ధన్, సయ్యద్ ఉమర్ ఉస్మాన్ అలీలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను వారు ప్రజాప్రతినిధులతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, నాగేంద్రప్రసాద్, శిల్పి ఆనందాచారి, గంగిసుబ్బమ్మ వెంకటరమణ, లక్ష్మీనారాయణ, వీరశంకర్‌రెడ్డి, విజయకుమారి, తులసి, సర్వజిత్, జ్యోతి ప్రియా, ఎం.వి రమణమ్మ, మస్తాన్, రమణమ్మ, వెంకటరమణ, బోగా వెంకటసుబ్బయ్య ప్రసాద్ రావు, పాలేటి సుబ్బరాయుడు, ప్రమీల రాహేల్, షేక్ హుస్సేన్, పెంచలయ్య పాల్గొని వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరిని, విద్యార్థులను ప్రశంసించారు.

గ్రామాల్లో పరిశుభ్రతపై అశ్రద్ధ వద్దు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మాట్లాడుతున్న ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అధికారులు అశ్రద్ధ వహించ వద్దని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి ట్యాంకర్లను క్రమం తప్పకుండా శుభ్రపర చాలని, తాగునీరు లీకేజీలను అరికట్టాలని తెలిపారు. మురుగనీటి కాలువలను శుభ్రపరచి, చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య నిర్వహణపై, శుద్ధమైన తాగునీటి సరఫరాపై క్రమం తప్పకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అనారోగ్య భారిన పడకుండా ప్రాథమిక చర్యలను తీసుకోవాలని సూచించారు. రోడ్లపై మురుగునీరు నిలిస్తే తద్వారా దోమలు వ్యాప్తి చెంది, ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని, నిల్వ ఉన్న నీటిని తొలగించాలని అన్నారు. తాగునీటి ట్యాంకర్లను బ్లీచింగ్‌తో శుభ్రపరచాలని తెలిపారు.

25 నుంచి జిల్లాలో పశుగణన : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఈనెల 25 నుంచి జిల్లాలో పశుగణన ప్రారంభమవుతుందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం రాయచోటిలోని క్యాంప్ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లైతో 21వ అఖిల భారత పశుగణన పై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుగణన భారతదేశ వ్యాప్తంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుందని, 21వ అఖిల భారత పశుగణన ఈనెల 25 నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 28 వరకు జరగనుందని తెలిపారు. జిల్లాలో కూడా పశుగణన జరగనుందని తెలిపారు. ఈ పశుగణన చేపట్టుటకు పశుసంవర్ధక శాఖ సహాయకులు, ఇతరులను కలిపి మొత్తం 292 మందిని నియమించినట్లుగా తెలిపారు. వీరి ద్వారా జరగబోయే పశుగణన ప్రక్రియకు పర్యవేక్షకులుగా సంబంధిత పశు వైద్యాధికారులను నియమించినట్లుగా ఆయన తెలిపారు. పశువుల గణాంకాలు సేకరించుటకు పశు వైద్య సిబ్బంది రైతుల ఇంటి వద్దకు వచ్చినప్పుడు రైతులు వారికి సహకరించి వారి వద్దనున్న ఆవులు గేదెలు, గొర్రెలు, మేకలు తదితర వివరాలను పశు వైద్య సిబ్బందికి అందించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో సిఎఒ వెంకట్ పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మేజర్ గ్రామపంచాయతీ రికార్డులను ఆర్‌టిఐ కార్యకర్త పఠాన్ మౌలా పరిశీలించారు. ఇటీవల గ్రామపంచాయతీ పరిధిలో గత మూడు సంవత్సరం ఆదాయ, వ్యయ వివరాలను తెలపాలంటూ ఆర్‌టిఐ కింద రికార్డులను తాను స్వయంగా పరిశీలిస్తానని కోరారు. దీంతో బుధవారం ఆయన పంచాయితీ కార్యాలయానికి వచ్చి రికార్డులను పరిశీలించగా ప్రస్తుత రికార్డులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, గత మూడు సంవత్సరాల రికార్డులు లేవని ఇఒ దృష్టికి తీసుకు వెళ్ళారు. ఆ రికార్డులకు తను జవాబుదారీ కాదని, ఈ విషయం ఉన్నతాధికారులకు అప్పీల్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

పాస్పోర్ట్ జారిపోయినది

షేక్ బాబ్జాన్, సన్నాఫ్ షేక్ ధాతు భాష, ఇంటి నెంబర్7-36, మజీద్ వీధి, చింతపర్తి గ్రామం, వాయల్పాడు మండలం, పాస్పోర్ట్ నెంబర్: **S2651157,** ఆధార్ నెంబర్: 473792521617, చింతపర్తి నుండి వాయల్పాడుకు ఆటోలో వెళుతుండగా పాస్పోర్ట్ జారిపోయినది ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాకు తెలుపగలరు సెల్ నెంబర్: 9963695066

పేరు మార్చబడినది

అన్నమయ్య జిల్లా, పీలేరు మండలం, గ్రామం, పాత మసీదు వీధి, డోర్ నెం.5-144/3లో నివాసముండు షేక్ చెర్వల్ కుమారుడు షేక్ అన్సర్ బాషా **(SHAIK ANSAR BASHA)** అను నేను ఇదివరలో షేక్ అన్సర్ భాషా **(SHAIK ANSAR BHASHA)** అని పిలవబడేవాడిని. అయితే నేను నా పేరును షేక్అన్సర్ బాషా **(SHAIK ANSAR BASHA)** గా మార్చుకొన్నాను. కావున ఇకపై నేను షేక్ అన్సర్ బాషా **(SHAIK ANSAR BASHA)** అని పిలువబడెను.

అధికారులతో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ఇసుక రీచ్‌లను పక్కాగా అమలు చేయాలి : జెసి

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీ మన జిల్లాలో పక్కాగా అమలు అవ్వాలని, ఇందులో ఎటువంటి అవకతవకలకు తావివ్వరాదని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని టంగుటూరు ఇసుక రీచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టంగుటూరు ఇసుక రీచ్‌కు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. ఇసుక రీచ్ నుంచి రోజు వారి ఎంత ఇసుకను తరలిస్తున్నారు. ఎవరెవరు తీసుకెళుతున్నా రు, వంటి వివిధ ప్రశ్నలను ఇసుక రీచ్‌ను నిర్వహించే అధికారులను అడిగి తెలు సుకున్నారు.ఉచిత ఇసుక పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు.

నేడు నీలకంఠరావుపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నీలకంఠరావుపేటలో గురువారం కడపకు చెందిన కింగ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు మండల వైసిపి మైనార్టీ నాయకుడు అయూబ్ ఖాన్ తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో చిన్నపిల్లలకు సంబంధించిన వ్యాధులు సంతానంలేని వారికి పరీక్షలు, స్త్రీలకు సంబంధించిన సమస్యలకు, గర్భిణులకు, విష జ్వరాలు, షుగర్, బిసి, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్ తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి మం దులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. నీలకంఠ రావు పేట ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సుబ్బలక్షుమ్మకు మాజీ ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-రామాపురం

మాజీ విఆర్‌ఒ, మాజీ సింగల్ విండో అధ్యక్షుడి మాతృమూర్తి సుబ్బలక్షుమ్మ పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బ లక్షుమ్మ ఇంటికి వచ్చిన అతిథులను గౌరవ ప్రదంగా పలకరించేదని, ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకునేదని, పేద ప్రజల పట్ల అభిమానం చూపేదని కొనియాడారు. ఆయన వెంట నల్లగుట్టపల్లి సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణరెడ్డి మాజీ ఎంపిపి ప్రభాకర్‌రెడ్డి అయోధ్య పురం ప్రసాద్‌రెడ్డి అయోధ్య పురంసుకుమార్‌రెడ్డి, అయోధ్య పురం ద్వారకనాథరెడ్డి, అయోధ్య పురం సన్నీ రెడ్డి వైసిపి రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రెటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, కనపర్తి చెన్నారెడ్డి, దువ్వూరి ఆంజనేయులు ఉన్నారు.

పేద మహిళకు నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక పట్టణంలోని వీణావతి అనే పేద మహిళకు ఎంపిడిఒ సిహెచ్ నాగార్జునరావు నిత్యావసర సరుకులను అందజేశారని గ్లోబల్ సర్వీసెస్ ట్రస్ట్ చైర్మన్ కె పార్థసారధి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మహిళ వీణావతి భర్త మృతి చెంది ఇబ్బందులు పడుతున్నారని తెలుపగా ఎంపిడిఒ స్పందించి తమ తరపున బియ్యం బస్తా, విజయవాడకు చెందిన రమేష్ వారిని సంప్రదించి వారి సహాయంతో రైల్వే కోడూరుకు చెందిన గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ ద్వారా ఆమెకు రూ.2,500 విలువైన నిత్యావ సర సరుకులు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. బాధితుల బంధువులు తెలిపిన మేరకు వివరాలు..గోపిదిన్నె పంచాయితీ కొత్తపల్లికు చెందిన కె.నరసింహారెడ్డి, కె.చిన్న నరసిం హారెడ్డి ద్విచక్ర వాహనంలో ఉప్పులూరు వాండ్లపల్లెకు వెళ్తుండగా గోపిదిన్నె క్రాస్ రోడ్డులో తంబళ్లపల్లె నుంచి బంద్రేవుకి వెళ్తున్న ఆటో వెనుక వైపు నుంచి ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి, చిన్న నరసింహారెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. గాయపడిన వారిని స్థానికులు ప్రయివేట్ వాహనంలో హుటాహుటిన తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

కారు ఢీకొని రైతుకు..

మదనపల్లె అర్బన్ : కారు ఢీకొని రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం ములకలచెరువు మండలంలో జరిగింది. సిఐ రాజారమేష్ కథనం మేరకు.. మండలం లోని గూడుపల్లికి చెందిన రైతు కృష్ణప్ప ద్విచక్ర వాహనంలో మొలక చెరువుకు వెళుతుండగా కదిరి నుంచి మదనపల్లె వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రైతును స్థానికులు 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం రైతు పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా కు తరలించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన బుధవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. తాలుక ఎస్‌ఐ హరిహర ప్రసాద్ కథనం మేరకు... మండలంలోని కోళ్లబైలు గ్రామం, జగన్ కాలనీలో కాపురం ఉంటున్న వై.స్వాతి(35) భర్తకు దూరంగా ఉంటూ జగన్ కాలనీలో అద్దె ఇంటిలో ఉంటుందని అన్నారు. కూలి పనులు చేసు కుంటూ తన ఇద్దరి పిల్లలను పోషించుకుంటున్నట్లు చెప్పారు. భర్త దూరం కావడం, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో జీవనం భారమై ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పంచనామ అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడలిపై మామ దాడి : కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని నూలివీడు పంచాయతీ ఆవులరెడ్డిగారిపల్లెకు చెందిన డేరంగుల ప్రమీలపై తన మామ చిన్నప్పకు దాడి చేశారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు. ఆస్తి విషయంలో సమస్య ఉండడంతో తన మామ , వారి బంధువులు ఐదుగురును కలిసి కాళ్లు, చేతులతో కొట్టి గాయపరిచారని ఫిర్యాదు లో పేర్కొన్నట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భార్య, కుమారుడు కనిపించలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని గోరాన్ చెరువు పంచాయతీ ఆవులశెట్టి వారి పల్లెకు చెందిన మల్లేష్ తన భార్య మౌనిక తన కుమారుడు తీసుకొని మంగళ వారం ఇంటి నుంచి వెళ్లి పోయిందని, ఆమె ఆచూకీ తెలపాలని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన మల్లేష్ భార్య మౌనిక, కొడుకు